ఉదయం దీపావళి కథల పోటీలో ప్రథమ బహుమతి

**ఉదయమనగా అడవిలోకెళ్లి దినమంతా చెట్టుచెట్టుకూ పుట్టపుట్టకూ తిరిగి దాదాపు ఓ నలభై కిలోల పెద్ద మోపెడు ఎండు చితుకులు ఏరుకొని వాటిని పన్నెండు కిలోమీటర్ల దూరం మోసుకువచ్చి, ఎర్రగా కందిపోయిన భూదేవిలాగా సూర్యుడు వగరుస్తూ పడమటింటికి ఇంకా పది నిమిషాలు నడవాలని విసుక్కున్నట్లుగా వున్నాడు.**

# భూదేవి



ఆయనకన్నా ముందే భూదేవి తన గుడిసెకు చేరుకొని వాకిట్లో కట్టెల మోపు దించి, ఆయాసంతో చూరు కింద కూలబడింది.

"ఓరి బుడ్డోడా! గా తెల్లకోడి గుడ్డువెట్టినాదిరా ఇయ్యాళ్ళ?"

గుడిసె ముందు చెల్లితో ఆడుకుంటున్న బుడ్డోడు,

"ఏమో నేం జూడ్లేదే అవ్వా!" అని సమాధానమిచ్చి ఆటలో మునిగిపోయాడు.

భూదేవికి లేచి చూడాలన్పించడంలేదు. ఆయాసం ఇంకా తగ్గలేదు. 'ఇయ్యాళ గాయిన్ని బుదుగులు దొరకతందుకే పొద్దువాయ! ఇగ గీ సీకట్ల యాడికి వోయి గీ మోపు నమ్ముకొద్దు' అనుకుంది భూదేవి.

నిన్నటి గుడ్డు, ఈ రోజటి గుడ్డు కలిపి ప్రక్కనున్న సాయిబు దుకాణంలో అమ్మితే రూపాయిన్నర వస్తుంది. వాటితో నూకలు తెచ్చుకొని పిల్లలూ తనూ ఎంగిలి పడ్తే సరి అని కూడా అనుకుంది.

ఎందుకో ఆ సమయంలో తనింట్లో ఉండాల్సిన నాల్గవ ప్రాణి జ్ఞాపకం వచ్చింది. తన 'మొగుడు' అనబడే ఆ ప్రాణి ఇప్పుడు హాయిగా కాయకష్టం చేసుకొంటూ, రెండు పూటలా భోంచేస్తూ జైల్లో 'సుఖంగా' ఉన్నాడు.

భూదేవి తల్లిదండ్రులకు ఒక్కటే బిడ్డ. కొత్తగా పెళ్ళైన రోజుల్లో 'భూదీ' అని మొగుడు దొంగచాటుగా పిలిచే పిలుపు మైకం తెప్పించేది.

దినమంతా ఇద్దరూ వొళ్ళొంచి పన్జేసి, రాత్రికి ఇంటికి జేరాక అంతఃపురంలోని రాజూ రాణీల కన్నా ఎంతో సంతోషంగా గడిపి, రేపటి చింతలేకుండా మొద్దు నిద్రపోయేవాళ్ళు. కొండొక సారి విడిచిన ఉడుపులు మళ్ళీ కట్టుకోకుండానే

రానురానూ మొగుడు చెడు స్నేహాలూ, చె డు అలవాట్లూ మరిగి, ఒళ్లొంచి కష్టపడకుండా తేలిగ్గా సంపాదించే మార్గాలు వెతికే ప్రయాస లో మరింత చెడిపోయాడు.

చెమటోడ్చకుండా సంపాదించే మార్గాలు, భూదేవి భర్త ఏ మాత్రం చదువుకోనందువల్ల అస్సలు పట్టుబడలేదు. చదువుకోక పోయినా కనీసం వాళ్ళ గుడిసెల వాడకి ఎన్నికల్లో ఏ కౌన్సిలర్‌గానో, మరి దేనిగానో నిలబడి గెల్చినా సరిపోయుండేదేమో!

దరిమిలా కొన్ని రోజులు పట్టుబడకుండా దొంగతనాలు సాగించి, భూదేవిని ఇద్దరు పిల్లల తల్లిని చేశాడు.

దొంగతనాలు సీరియస్‌గా మరిగినవాడు జైలుకెళ్ళేవరకు భూదేవిని పట్టించుకోవడమే మానేశాడు. జైల్లో ఉండి పూర్తిగా మర్చిపోయాడో, లేదో తెలవదు.

# రు. 2000 — గెల్చుకున్న ఉత్తమ కథ!

ఆ రోజట్నుంచీ ఇప్పటి వరకు, సరిగ్గా ఆ యాసం తీర్చుక్కొనే తీరిక కూడా ఎరగకుండా పిల్లల్ని పోషించుకొస్తోంది.

మెల్లగా లేచి గుడిసెలోనికి అడుగుబెట్టిన భూదేవికి నీళ్ళ కడవ చాటున ఏదో ఉన్నట్లుతోచింది. దగ్గరికెళ్ళి చూసింది తెల్లకోడి! 'ఇంకా గుడ్డుమీదనే గుసున్నట్లున్నది' అనుకున్న భూదేవి దగ్గరగా వెళ్ళి చేత్తో కదిపింది.

మెత్తగా తాకి ఒక పక్కకి వాలిపోయింది తెల్ల కోడి! భూదేవికి గుండె ఆగిపోయినట్లనిపించింది! 'తెల్లకోడి చచ్చిపోయింది' అని అనుకునే సరికి ఎక్కడలేని దుఃఖమొచ్చింది. చివరకు తన ని పోషించలేని మొగుడు జైలుకెళ్తున్నప్పుడు కూడా అంత దుఃఖం రాలేదు.

అది ఎంత చిన్న ప్రాణైనా తన వంతుగా ఆ కుటుంబాన్ని ఎంతో కొంత పోషిస్తోంది.

గుడ్ల నిండా నీళ్ళతో, ఒక చేత్తో చచ్చిన కోడిని పట్టుకొని బయటకు వచ్చింది భూదేవి.

"ఓరి బుడ్డోడా! గీ కోడికేమాయెరా? ఎట్ల జచ్చిందిరా? నువ్వేమన్నా బండవట్టి కొడ్తివా ఏంది?"



ఆడుకుంటున్న బుడ్డోడు, వాడి చెల్లెలూ ఆశ్చర్యంగా తల్లివైపు చూశారు.

''సచ్చిపోయిందా? గప్పుడు పిల్లొచ్చిందే అ, వ్వా! ఎంత గొట్టినా వోలేదు''

''నీ తాడుదెంప! గా పిల్లిని గొట్టలేక పోయినవురా!'' అంటూ బుడ్డోణ్ణి వీపు మీద నాలుగు అంటించింది కోపంలో!

వాడొకే తీరుగా ఏడు పెత్తుకునే సరికి తోడుగా చెల్లెలూ అందుకొంది భయంతో!

భూదేవి చచ్చిన కోడిని మరోసారి పరీక్షగా చూసింది. ఎక్కడా గాయం కన్పించలేదు. 'పిల్లిగిన ఒక్కసరి మీదెగిరిందేమో ఉత్త భయంకే సచ్చిపోయింది పిరికి ముండ' అనుకుంది.

ఏడుస్తున్న పిల్లల వైపు జాలిగా చూసి 'ఉత్త పుణ్యంకే పిల్లగాండ్ల మీద సెయి దింపితి' అనుకుంటూ...

''ఉకుండుండ్రి పోరగాండ్లల్లా ఉకుండుండ్రి! మీరేం జేస్తరు! నా తక్‌దీర్ (అదృష్టం)నే జంగవిల్లి (అడవిపిల్లి) వట్టింది. ఇగ మిమ్మల్ని గొట్టి ఏం ఫాయిద'' అంటూ సముదాయించింది.

కొంచెం సేపటికి బుడ్డోడు తల్లి నడిగాడు.

''మరి దాన్నిప్పుడు ఏం జేత్తవే అవ్వా! కూరందుకొని తిందమ'' బుడ్డోడి ప్రశ్నతో భూదేవి ఆలోచనలో పడింది.

పోరగాండ్లెన్నడూ బుద్దచ్చినంక కోడి కూర దిని సూడ్లేదు. అందుకుంటే గింత కడుపు నిండన్నా దింటరు. గని గా కోడికూర అండతం దుకు దినుసులేదున్నయి గుడిశెల.

గింత నూనె సమరన్నా లేకపోతే ఉత్త ఉప్పు, కారంతోటి కూరేడవుతది. ఇగ గిట్లగాదు పెద్ద మార్కెట్లకు వోయి దీన్ని అమ్మి, గా పైసల్తోటి గాయిన్ని సేపలూ, గింత నూనె బొట్టు దెచ్చుకుంటే పోరగాండ్లకింద 'నీసు'వెట్టినట్లయితది' అని ఆలోచించింది.

అదే ముక్క పిల్లలకు తెలియజెప్పి కోడిని ఓ గుడ్డలో ముడుచుకుని మార్కెట్టుకు బయలుదేరింది భూదేవి.

తల్లికి చెరోవైపున నడుస్తున్న పిల్లలు మార్కెట్టు వింతల గురించి మాట్లాడుతున్నారు.

''అవ్వా నాకు గాడ పలారం గొనియ్యాలా! ఆ'' అంటూ బుడ్డోడు గునుస్తున్నాడు. వాడి చెల్లీ గునుస్తోంది.

''గట్లనే గని తొవ్వ జూసుకుంట జప్పన నడుండ్రి!''

ఆ మార్కెట్‌లో కోళ్ళ, చేపల మాంసం విభాగం విడిగా ఉంది. అక్కడ ఎండు చేపలూ, రొయ్యలూ రాసులుగా పోసి ఉంటాయి. కోళ్ళ మాంసం దుకాణాల నుండి ఓ రకమైన వాసన వస్తూ, ఆ ప్రాంతంలోకి వచ్చిన మాంసాహార ప్రాగుబోతుల్ని తన్మయుల్ని చేస్తోంది. ఈమాంసాహార వాసనల మధ్యలో ఓ దుకాణంలో వెలసిన ఓ దేవుడి ముందు, దుకాణదారు బేరాల నాశించి వెలిగించిన అగరువత్తి మరీ వెగటు వాసన కొడ్తోంది.

ఆ మార్కెట్‌లో ఓ మూలన గుడ్డ పరచి దానిమీద చచ్చిన కోడిని పెట్టుకొని కూర్చుంది భూదేవి. తల్లి వెనకాతల పిల్లలు చేరి అసహనంగా కూర్చున్నారు.

మార్కెట్లోకి వచ్చే వాళ్ళ వైపు ఆశగా చూస్తోంది భూదేవి. అదే బతికున్న కోడైతే కొంచెం అటూ ఇటూగా ఈ పాటికి అమ్ముడైపోయేది.

కొందరు అక్కడి వరకొచ్చి కోడి మెడ వాలిపోయి ఉండటం చూసి పెదవి విరిచి కదిలిపోతున్నారు. భూదేవికి తెలుసు చచ్చిన కోడిని ఏ రకమైన మనుషులు బేరం చేస్తారో! అలాంటి వారికోసం చూస్తోంది.

భూదేవికి ఎదురుగా సెకండ్ హ్యాండ్ చీరలూ, ప్యాంట్లూ అమ్మే దుకాణముంది. ఆ వైపుగా ఉన్న జనంలో ఎవరన్నా తన కోడిని తప్పక కొనొచ్చు.


ఆ చీరల దుకాణం ముందు ఓ కష్ట జీవుల జంటలోని మొగుడు, నేలమీద పరచిన చీరల్లోంచి ఓ దానిని ఏరి పెళ్ళాం ఒంటిమీద అదిమిపట్టి నప్పుతుందా లేదా అని చూస్తుంటే ఆ పెళ్ళాం అంతకు ముందే చిరిగి వున్న పైటను తంటాలు పడి సర్దుకుంటూ అతి సహజంగా సిగ్గుపడుతోంది.

వాళ్ళ వద్ద సిగ్గు, బిడియం, అనురాగం, ఒకరిమీద మరొకరికి నమ్మకం పుష్కలంగా ఉన్నాయి. లేనిదల్లా ఒక డబ్బుమాత్రమే! డబ్బున్నవాళ్ళకి అదొక్కటి తప్ప మరేమీ ఉండకపోవడంలో ఆశ్చర్యంలేదు.

ఆ జంట బట్టలేరుకొనే దృశ్యం చూసిన తర్వాత భూదేవికి తను అత్తారింట్లో అడుగు పెట్టిన తొలి రోజులు గుర్తుకొచ్చాయి. తనకి కొత్త చీర, ఇంట్లో ఎవరినీ అడక్కుండానే కొనుక్కొచ్చాడని రెక్కల కష్టం పెళ్ళాం షోకులకి ధారపోస్తున్నాడనీ, తల్లీదండ్రీ ఎంత గొడవ చేసినా ఆ చీరలో తన అందాల్ని చూసుకొని 'జన్మ జన్మలకీ నాకు నువ్వే'నంటూ చీకటి బాసలు చేసిన మొగుణ్ణి చివరకు ఏ మాయభూతమొచ్చి దారి మళ్ళించుకుపోయిందో వాణ్ణి జైలుకీ, తనని చచ్చిన కోడి అమ్మకోడానికి మార్కెట్ దాకా పంపేసింది.

చివరికా జంట చచ్చిన కోడికేసి ఓసారి చూసి పెదవి విరిచి మరోచోటికి వెళ్ళిపోయారు. భూదేవి ముందు మినుకు మినుకుమన్న కాసింత ఆశా వాళ్ళతోబాటే పోయింది. ఈ దేశంలో ఓ మనిషి శవాన్ని అక్కడికక్కడే విడి భాగాల క్రింద విడగొట్టి మరీ అమ్మడం చాలా సులువనీ, వీలైతే వాటిని బ్లాకులోనూ అమ్ముకోవచ్చని భూదేవికి తెలియదు. భూదేవి అమ్మేది కేవలం ఒక చచ్చిన కోడి శవాన్ని! దాన్నెవరు కొంటారు!

ఎవడో ఒకడు భూదేవి ముందరున్న కోడిని పరీక్షగా చూస్తున్నాడు. భూదేవికి ఆశ చిగురిం



చింది. కానీ మనిషి చూస్తే ఎర్రగా, బుర్రగా ఉన్నాడు వీడెందుకు కొంటాడనుకొంది. ఎర్ర బుర్ర దగ్గరకొచ్చి బేరమాడసాగింది.

"ఎంతకిస్తావు?"

"పది రూపాలకిచ్చేస్త తీస్కో బాపూ!"

"రెండ్రూపాలకిస్తవా?"

"రెండ్రూపాలంటే అన్నేలం బాపూ! ఏడ్రూపాలకిత్త! తీస్కోండ్రి"

"హు! సచ్చిన కోడి యేడ్రూపాలట!" అంటూ వెళ్ళిపోయాడు.

అది రెండ్రూపాయలకే గనక వస్తే చచ్చిందైనా, కుళ్ళిందైనా తినేస్తాడన్న మాట! డబ్బుకి గడ్డేకాదు, కుళ్ళిన మాంసం కూడా తినే మనుషులున్నట్లే నిర్ధారించవచ్చు.

భూదేవి పిల్లలు పేచీలు పెట్టేస్తున్నారు.

"ఇంకెంత సేపే అవ్వా! ఆకలైతుందే" అంటూ బుడ్డోడు,

"ఫలారం గొనియ్యవే" అంటూ ఆడి చెల్లెలు.

భూదేవి నిజంగా భూదేవంత ఓపికతో వాళ్ళను సముదాయిస్తోంది.

అప్పటికే రాత్రి ఏడున్నర కావస్తోంది. ఎర్ర బుర్ర తర్వాత ఎవరూ కోడిని బేరం చేసిన పాపాన పోలేదు. భూదేవికి భయమేస్తోంది. ఇంకో అరగంటైతే మార్కెట్లో జనం పలుచబడ్తారు.

పక్కన కోడి మాంసం దుకాణం ముందు తెల్లగా, నున్నగా బలిసిపోయినోకాయన తన వెనుక జేబులోంచి ఓ నోట్ల కట్టని తీసి అందులోంచి యాభై రూపాయల నోటుని షాపతనికి అందించాడు.

భూదేవి పరిస్థితి ఆయనకు తెలిస్తే... గిలిస్తే ఆయన దయతలచి ఆ కట్టలోంచి ఒక్క నోటైనా భూదేవికి ఇస్తే... గిస్తే...

రెండు అగ్ర రాజ్యాల మధ్య యుద్ధ సమస్య కన్నా తీవ్రమైనది-ఆకలికీ, భూదేవి పిల్లలకీ మధ్య జరిగే భయంకర యుద్ధ సమస్య-చిటికెలో తీరిపోతుంది.

కానీ... తెల్లగా, నున్నగా బలిసిపోయిన వారెవరికీ భూదేవిలాంటి వారి మీద దయ 'తలచడానికి' సమయముండదు. ఒకవేళ ఉన్నా అది వారి 'జాతి' సాంప్రదాయం కాదు!

ఉండీఉండీ భూదేవి ముక్కు పుటాలకు ఏదో వాసనేసింది. కుళ్ళిన వాసన అది! కోడి శవం నుండే వస్తోంది! భూదేవి కోడిని దగ్గర్నుంచి వాసన చూసింది. నిజమే! అది కుళ్ళు వాసన కొడ్తోంది. ఇక ఆ వాసనొచ్చిన తర్వాత రూపాయికిస్తానన్నా కొనడం కష్టం.



# మురళీధర్‌కు ప్రథమ బహుమతి

ఉదయం వారపత్రిక దీపావళి సందర్భంగా నిర్వహించిన కథల పోటీల్లో ఆదిలాబాద్‌కు చెందిన శ్రీ బి.మురళీధర్ ప్రథమ బహుమతి (రూ.2000) లభించింది. శ్రీ మురళీధర్ రచించిన భూదేవి అనే కథకు ఈ బహుమతి లభించింది.

శ్రీ బి.మురళీధర్ ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలం సోనాల గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ వ్యవసాయశాఖలో గ్రామ విస్తరణాధికారిగా పని చేస్తున్నారు. గతంలో ఈయన కవితలు 'భారతి' తదితర పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. 'అడవిపువ్వు' అనే కథకు కూడా ఈయనకు బహుమతి వచ్చింది. జిల్లా రచయితల సంఘానికి కార్యదర్శిగా ఉండి, అనేక సాహితీ కార్యక్రమాలలో చురుకుగా ఉంటున్నారు.

భూదేవికి కళ్ళముందు చీకటి కన్పిస్తోంది. అసలు ఏమాలోచిస్తోందో తనకే తెలియడం లేదు.

అప్పటికే చిన్నపిల్ల కునుకుతూ, కునుకుతూ మూలన నిద్రపోయింది. బుడ్డోడు మాత్రం బలవంతాన నిద్రనాపుకుంటూ తల్లి కొనిచ్చిబోయే ఫలహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు.

భూదేవి కూతురు నిద్రలో కొంచెం కదిలింది. ఆ పిల్ల పెదవులు అస్పష్టంగా ఆకలి అని పలుకుతున్నాయి.

భూదేవి ఆ పిల్లను జోకొడుతూ వెనుకకు తిరిగి ఉన్నంతలో బుడ్డోడు—

"అవ్వా! కుక్క! కుక్క! మన కో! కోడి!" అంటూ అరిచాడు.

భూదేవి ఇటు తిరిగేంతలో కోడిని నోట కరుచుకొని కనుమరుగైంది కుక్క! భూదేవికి తన బ్రతుకునే కుక్క నోట కరుచుకుపోయినట్లనిపించింది.

బుడ్డోడి నిద్ర కళ్ళు—భయంగా, ఆశ్చర్యంగా, అనేక ప్రశ్నార్థకాలతో నిండి తల్లిని చూస్తున్నాయి.

పిల్లల్ని చూడగానే ఆపుకోలేని దుఃఖమేసి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలెట్టింది భూదేవి.

కాసేపటికి నిస్సత్తువగానైనా ఒక 'నిర్ణయానికి' వచ్చిన దానిలా కూతుర్ని చంకనేసుకొని, పరచిన బట్ట ముడిచేసుకుని, బుడ్డోణ్ణి చేయి పట్టుకు నాలుగడుగులు వేసింది.

"అమ్మా! యే పాంచ్ రుపయా లేలో! ఔర్ ఘర్ జాకర్ బచ్చోంకొ ఖిలాదో!"

(అమ్మా! ఈ అయిదు రూపాయలు తీసుకో! ఇంటికెళ్ళి పిల్లలకి అన్నం తినిపించు!)

అనుకోకుండా తలెత్తి చూసింది భూదేవి!

ఎదురుగా ఎండు చేపలమ్ముతున్న సాయిబు, చేతిలో ఐదు రూపాయల నోటుతో తీస్కోమని అంటున్నాడు.

భూదేవికి నోట మాటరాలేదు!

"లేలో అమ్మా! లేలో!" (తీసుకోఅమ్మా! తీసుకో!) భూదేవికి పిల్లలు గుర్తుకొచ్చారు. వాళ్ళ ఆకలి గుర్తుకొచ్చింది.

అంతకు కొన్ని క్షణాల ముందే ఈ మూడు ప్రాణాల గురించి తను తీసుకున్న 'నిర్ణయం' తప్పని తెలిసింది భూదేవికి. అంతేకాదు—

ఇంకా బ్రతికే వున్న 'మంచి'ని గురించీ తెలిసింది భూదేవికి.

ఒక్క అయిదు రూపాయల నోటు మూడు ప్రాణాల్ని కాపాడగలదని చాలా మందికి తెలియదు. అయితే—కొందరికి తెలుసు! ఆ కొందరి మీద నమ్మకంతోనే ధైర్యంగా కళ్ళ నీళ్ళు తుడుచుకొని తిరిగి బ్రతికేందుకు సాయిబు వైపు చేయి సాచింది భూదేవి. ○

